క్లుప్తంగా

దరఖాస్తులు ఆహ్వానం

నాదెండ్ల: మండలంలోని చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు కోరబడుతున్నట్లు ప్రిన్సిపల్ ఝాన్సీవాణి తెలిపారు. పదో తరగతి పరీక్ష ఫలితాలు వెలువడ్డాయని, అర్హులైన విద్యార్థులు మే 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఇంగ్లిష్ మీడియంలో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు.

రెడ్డి పేరంటాలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు



నాదెండ్ల: సాతులూరులో కొలువైయున్న శ్రీరెడ్డి పేరంటాలమ్మ తల్లి ఆలయం ప్రతిష్ఠ నిర్వహించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం అమ్మవారికి అలంకరణ, గోత్రనామ పూజలు నిర్వహించనున్నారు. పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించనున్నారు. రాత్రికి ఆలయం వద్ద పౌరాణిక నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు.

జమ్మలమడక మేజర్‌లో పిచ్చిచెట్ల తొలగింపు



నూజెండ్ల: మండలంలోని జమ్మలమడక మేజర్‌లో పిచ్చిచెట్ల తొలగింపు పనులు చేపట్టారు. ఈ చెట్ల వల్ల చివరి భూములకు సాగునీటి సమస్య తలెత్తుతుందని రైతుల విన్నపం మేరకు జల వనరుల అధికారులు 25 లక్షలు నిధులు మంజూరు చేయించడంతో పనులు చేపట్టినట్లు డీసీ చైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు.

28న క్యాంపస్ ఇంటర్వ్యూలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు రోడ్డులోని పీఎన్‌సీ అండ్ కెఆర్ కళాశాలలో ఈనెల 28వ తేదీ సోమవారం హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రేమ్‌చంద్ శుక్రవారం తెలిపారు. ఇంటర్వ్యూలలో పాల్గొనేందుకు 2021 విద్యా సంవత్సరం నుంచి 2025 విద్యా సంవత్సరం వరకు బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వార్షిక వేతనం, ఇతర అలవెన్స్‌లు లభిస్తాయని తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి కె.హరికృష్ణ తెలిపారు.

28 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో ఈనెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి యడ్లపాటి రాధ శుక్రవారం తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం నిర్వహించబడుతుందన్నారు. శిబిరంలో విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే పుస్తక పఠనంతో పాటు మానసిక ఉల్లాసానికి తోడ్పడే ఆటలు, దేశభక్తి గేయాలు, జనరల్ నాలెడ్జి, జనరల్ సైన్స్, గణితం, వేదిక్ మ్యాథ్స్ తదితర అంశాలలో నిపుణులైన వారి ఆధ్వర్యంలో తరగతులు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర పౌర గ్రంథాలయశాఖ ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. విజ్ఞాన శిబిరానికి హాజరు కావటం ద్వారా విద్యార్థులు తమ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

28 నుంచి యోగ శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: శ్రీ వెంకటేశ్వర యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ నుంచి 186వ ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు శిబిర నిర్వాహకులు కూనిశెట్టి వెంకట జనార్దన్ గురూజీ శుక్రవారం తెలిపారు. శ్రీ పట్టాభిరామస్వామి ఆలయంలోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో ప్రతిరోజు ఉదయం 5 నుంచి 7 గంటల వరకు 28 రోజుల పాటు శిక్షణ ఉంటుందని వివరించారు.

కార్మిక పక్షపాతి అవ్వారి

నరసరావుపేట ఈస్ట్: కార్మికుల సమస్యలను పరిష్కరించటంలో ముందుండి పోరాడిన యోధుడు అవ్వారి భావన్నారాయణ అని పలువురు వక్తలు కొనియాడారు. పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకుడు అవ్వారి 31వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే యూనియన్ బలోపేతానికి కృషిచేసిన అవ్వారి సహచరులు సి.హెచ్.ఎల్ కాంతారావు, తోట పిచ్చయ్య, మందడపు దుర్గాప్రసాదు, జీవరత్నం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి రంగయ్య మాట్లాడుతూ, 1964లో యూనియన్ స్థాపించినప్పటి నుంచి కార్మికుల సమస్యలను పరిష్కరించటంలో అవ్వారి కృషి చేసారని తెలిపారు.

మలేరియా అంతానికి డ్రైడే పాటించాలి

ర్యాలీ నిర్వహించిన డాక్టర్లు, సిబ్బంది



ర్యాలీకి పచ్చజెండా ఊపుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి, రవీంద్ర రత్నాకర్

నరసరావుపేట: జిల్లాలో మలేరియా అంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ డ్రైడే ద్వారా కృషిచేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవీంద్ర రత్నాకర్ ఆధ్వర్యంలో కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీకి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. మలేరియాను అంతం చేసేందుకు అన్నీ వనరులు సమీకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరి నుంచి మలేరియాను పారద్రోలాలన్నారు. మంచినీటిలో ఆడ ఎనాఫిలిస్ దోమ గ్రుడ్లు పెట్టడం ద్వారా అవి దోమలుగా మారి వ్యాధిని వ్యాప్తి చేస్తాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడే పాటించాలని కోరారు. ప్రతి వారం పనికిరాని వస్తువుల్లో నిల్చిన నీటిని తొలగించాలని, వాడుతున్న వస్తువుల్లో ఉన్న నీటిని మార్చాలని కోరారు. జిల్లా మలేరియా అధికారి రవీంద్ర మాట్లాడుతూ మలేరియా అనేది పెద్ద వ్యాధి అయినా చిన్న రక్తపరీక్ష ద్వారా నిర్ధారించి ప్రభుత్వ హాస్పిటల్ నుంచి ఇచ్చే ఉచిత మందులతో రూపాయి ఖర్చులేకుండా నివారించుకోవచ్చన్నారు. ర్యాలీలో డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి, డాక్టర్ హనుమ కుమార్, డీఐఓ డాక్టర్ గీతాంజలి, ఏఎంఓ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్‌యుఓ కొల్లిపర శ్రీనివాస్, కుంచాల శ్రీనివాస్, వైద్య ఆరోగ్యశాఖ, మలేరియా సిబ్బంది, జీఎన్ఎం శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

మలేరియా అంతం చేయడం అందరి బాధ్యత

రొంపిచర్ల: మలేరియాను అంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వైద్యాధికారి డాక్టర్ ఎన్.సాయి బాబా అన్నారు. స్థానిక ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. మలేరియా అంతం మన తోనే సాధ్యమని ర్యాలీలో నినాదాలు చేశారు. పరిసరాలు శుభ్రత, దోమల నివారణ, ఆహారపు అలవాట్లపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, కిరణ్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

శావల్యాపురంలో..

శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియా అవగాహన ర్యాలీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి రావిపూడి రమ్య పాల్గొని మాట్లాడుతూ మలేరియా వ్యాధి దోమకాటు వలన వస్తుందన్నారు. చలిజ్వరం, తల నొప్పి, ఒళ్లు నొప్పులు, తదితర లక్షణాలు క్రమం తప్పకుండా వస్తుంటే అశ్రద్ధ చేయకుండా సత్వరమే వైద్యపరీక్షలు చేయించాలని ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన ప్రాణపాయం పొంచి ఉంటుందన్నారు. దోమల నిల్వ ఉండకుండా మురుగునీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించండి

- మూడు ప్రధాన సమస్యలపై ప్రభుత్వానికి విజ్ఞప్తి
- రాజ్యాంగ పరిరక్షణ సమితి సమావేశంలో యడ్లపాడు వాసులు గోడు



సమావేశంలో పాల్గొన్న సీహెచ్ సుబ్బారావు, కాలనీ వాసులు

యడ్లపాడు: స్థానిక ఎస్సీకాలనీ (పైపల్లె)లో శుక్రవారం రాజ్యాంగ పరిరక్షణ సమితి కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సి.హెచ్.సుబ్బారావు కాలనీ స్థితిగతులపై చర్చించారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు మూడు ప్రధాన సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చారు. అవి కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 8 సెంట్ల స్థలం ఉన్నప్పటికీ, ఇప్పటికీ నిర్మాణం జరగకపోవడం బాధాకరమని ఆయన వ్యాఖ్యానించారు. వెంటనే కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. అలాగే, పీబీసీ (పెదనందిపాడు బ్రాంచ్ కాలువ) నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఉన్న సిమెంట్ రోడ్డు ఇరువైపులా డ్రెయినేజీ సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సైడ్ కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు. కాలనీలో కుటుంబాలు, జనాభా పెరిగిన నేపథ్యంలో 1927లో బ్రిటీష్ ప్రభుత్వం ఇచ్చిన శ్మశానవాటిక అవసరాలను తీర్చలేకపోతున్నదన్నారు.

చనిపోయిన వారి కోసం స్థలంలేక ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, శ్మశాన వాటికను భూమిని కేటాయించి విస్తరించాల్సిన అవసరం ఉందంటూ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు యామర్తి కోటేశ్వరరావు, సంఘపెద్ద కోడిరెక్క నాగయ్య, కోడిరెక్క జాన్‌బాబు, యాజిలీ డేవిడ్, చావా నాగరాజు, అంబడిపూడి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో ఇరువురు ప్రముఖులు మృతి

- ఒకరు రేడియోలు అమ్మకందారుడిగా..
- మరొకరు పాల వ్యాపారిగా సుప్రసిద్ధులు



వెంకటేశ్వర్లు మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

వినుకొండ : పట్టణంలో ఒకే రోజు ఇరువురు ప్రముఖులు మృతిచెందారు. పట్టణంలోని మెయిన్ బజారుకు చెందిన లింగమల్లు పుల్లారావు రేడియోషాపు పుల్లారావుగా అందరికీ సుపరిచితులు. గత 50 సంవత్సరాల నుంచి వినుకొండలో రేడియోలు అమ్ముతున్నారు. పుల్లారావు అంటే తెలియని వారు ఈ ప్రాంతంలో లేరు. అయితే గురువారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయం వెనుక నివాసం ఉంటున్న బొల్లా వెంకటేశ్వర్లు (84) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందాడు. ఆయన కూడా పాల వ్యాపారంలో మంచిపేరు ప్రతిష్ఠలు సంపాదించారు. గత 60 ఏళ్లుగా వినుకొండలో పాల వ్యాపారం చేస్తూ అందరికీ సుపరిచితమైన వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందారు. ఇరువురి మృతికి మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సంతాపం తెలియజేశారు. వ్యాపార ప్రముఖులు ఒకే రోజు చనిపోవడం బాధాకరమని వారి కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదు



శిబిరంలో నినాదాలు చేస్తున్న కార్మికులు

నరసరావుపేట: నెలరోజుల పాటు పనిచేసినా సగం రోజులకే వేతనాలు ఇవ్వడం దుర్మార్గం అంటూ కొంతమంది మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో 37వ రోజుకు చేరింది. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మెశిబిరంలో జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ కార్మికుల శ్రమను దోచుకోవడం తగదన్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కార్మికుల ఓట్లతో గద్దెనెక్కిన ప్రజా ప్రతినిధులు వారి సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. ఆప్కాస్‌లో ఉన్న మిగతా కార్మికులతో పాటు వేతనాలు ఎందుకివ్వరని ప్రశ్నించారు. కరోన సమయంలో ప్రాణాలకు తెగించి పారిశుద్ధ్య పనులు నిర్వహించిన 40 మంది కార్మికుల పేర్లు ఆప్కాస్‌లో ఉన్నప్పటికీ బదిలీ కార్మికులని ఎలా అంటారని ప్రశ్నించారు. అధికారులు ప్రజా ప్రతినిధులు దిగొచ్చి న్యాయం చేసేవరకు పోరాటం చేయాలని కార్మికులకు సూచించారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

నరసరావుపేటటౌన్: పాకిస్తానీ ముష్కరుల దుశ్చర్యను ఖండిస్తూ స్థానిక న్యాయవాదులు శుక్రవారం విధులకు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముక్తకంఠంతో పాకిస్తాని దుశ్చర్యను తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సాయంత్రం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేదరమెట్ల నాగేశ్వరరావు, న్యాయవాదులు సీతారామిరెడ్డి, విజయ్ కుమార్, చంద్రోఖర్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

బాకీ వివాదం.. ఒకరిపై దాడి

నరసరావుపేటటౌన్: బాకీ విషయంలో తలెత్తిన వివాదం దాడికి దారితీసింది. సంఘటనలో కాలు విరిగిందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ శుక్రవారం తెలిపారు. షాలెంనగర్‌కు చెందిన షేక్ నాగూర్ భాషా అదే ప్రాంతానికి చెందిన పాచు వద్ద రూ.10 వేలు వడ్డీకి తీసుకున్నాడు. సకాలంలో చెల్లించక పోవటంతో నాగుర్ భాషా ఇంటి వద్దకు వెళ్లి పాచు రెండు రోజుల క్రితం గొడవకు దిగాడు. అక్కడే ఉన్న నాగుర్ భాషా మేనమామ షబ్బీర్ భాషా అడ్డుకొని వాగ్వివాదానికి దిగాడు. దీంతో అతని పై పాచు దాడికి పాల్పడ్డాడు. సంఘటనలో షబ్బీర్ భాషా కాలు విరిగింది. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైతులకు ఫారం-9 నోటీసులు జారీ



ఫారం 9 నోటీసు అందజేస్తున్న తహసీల్దార్ అర్జున్ నాయక్

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు రెవెన్యూ గ్రామంలో రీసర్వే పనులు పూర్తయినట్లు తహసీల్దార్ యం.అర్జున్ నాయక్ తెలిపారు. శుక్రవారం గ్రామసచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించి ఫాం 9 నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ గ్రామ పరిధిలో 4400 ఎకరాల విస్తీర్ణం భూములను రోవర్ వంటి ఆధునిక యంత్ర పరికరాల ద్వారా సర్వే టీమ్స్ కొలతలు, సరిహద్దులు రైతుల సమక్షంలో రెవెన్యూ అధికారులు చేశారన్నారు. ఇందుకు గాను 3500 మంది రైతులకు ఫారం 9 నోటీసులు పంపిణీకి సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వ నిభంధనల ప్రకారం భూ విస్తీర్ణం 5 సెంట్లు దాటిన రైతులు మాత్రమే భూ సమస్య పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హత ఉంటుందన్నారు. అనంతరం గ్రామసభలో 100 రైతులకు ఫారం 9 నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజు, వీఆర్‌వో చిన్న మంగయ్య రైతులు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు యంత్రాల పంపిణీ



వినుకొండ: ఎస్‌ఐఆర్‌సీపీ వారు నిర్వహిస్తున్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఉప ప్రణాళిక 2024-25 సంవత్సరంలో భాగంగా జీపీఐ పొగాకు రైతులకు వ్యవసాయ యంత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐఆర్‌సీపీ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషు మాధవ్ మాట్లాడుతూ పొగాకు అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గకుండా నాణ్యమైన పొగాకును పండించుటకు తగు సూచనలు చేశారు. గుంటూరు ఎస్‌ఐఆర్‌సీపీ పరిశోధన కేంద్రం హెడ్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెగుళ్లు, కీటకాల నివారణకు పిచికారి చేసే పురుగు మందుల గురించి, జాగ్రత్తలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో జీపీఐ ప్రతినిధులు జీఆర్‌కే రమేష్‌రాజు, ఉమామహేష్, జి.వినయ్, సీహెచ్.వీరారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

మేఘనశ్రీని అభినందించిన ఉపాధ్యాయులు



విద్యార్థిని అభినందిస్తున్న లింగారావుపాలెం జెడ్పీహైస్కూల్ ఉపాధ్యాయులు

యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థిని నక్క మేఘనశ్రీ పదో తరగతి ఫలితాల్లో 565/600 మార్కులతో మండల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. ప్రభుత్వ పాఠశాలల మధ్య టాపర్‌గా నిలిచిన ఆమెను శుక్రవారం ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కేవీ రామిరెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు 46 మంది పరీక్షలు రాయగా, 43 మంది ఉత్తీర్ణులైయ్యారని తెలిపారు. దీంతో పాఠశాల 93.5 శాతం ఉత్తీర్ణతను నమోదు చేసిందన్నారు. అత్యుత్తమ ప్రతిభను చాటిన నక్క మేఘనశ్రీ స్కూల్ ఫస్ట్ రావడంతోపాటు మండలం టాపర్లలో రెండోస్థానంలో నిలిచిందన్నారు. అదేవిధంగా వి.యశస్విని, వి.సంజన విద్యార్థినులకు 563 మార్కులతో పాఠశాలలో ద్వితీయస్థానం, మండల టాపర్లలో తృతీయస్థానాన్ని కైవసం చేసుకోవడం అభినందనీయం అన్నారు. అలాగే 500 మార్కులకు పైగా వచ్చిన వారు 11 ఉండటం విశేషం అన్నారు. అనంతరం విద్యార్థిని నక్కా మేఘనశ్రీతో పాటు వారి తల్లిదండ్రులు నక్కా వీరరాఘవయ్య, జ్యోతిప్రియాంకను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు తోకల వీరరాఘవయ్య, ఎస్ఎం చైర్మన్ షేక్ జాన్‌సైదులు, కోఆప్షన్ సభ్యులు నండూరి శివరామకృష్ణయ్య, తోకల సత్యనారాయణ, ఉపాధ్యాయులు డి.రామాంజనేయులు ఉన్నారు.

టెన్త్ టాపర్లకు అభినందన

యడ్లపాడు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో యడ్లపాడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు గర్వకారణంగా నిలిచారని హెచ్ఎం మాధురిరాణి తెలిపారు. ఉన్నవ జెడ్పీహైస్కూల్ విద్యార్థులు కె జయలక్ష్మి, బి ఫణీంద్రసాయిలను ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. ఇరువురికి ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్షా ఫలితాలో 566/600 ఒకే తరహా మార్కులు రావడం విశేషం. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థుల కృషి, పట్టుదల, వారి కుటుంబ సభ్యులు మద్దతు, సహ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్‌లుగా నిలిచారన్నారు.

ఉత్తమ భవిష్యత్ కోసం లక్ష్యాలు నిర్దేశించుకోండి

సూచించిన ఏఎం రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి శాంతి



కార్యక్రమానికి హాజరైన శాంతి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: విద్యార్థులు ఉత్తమ భవిష్యత్ కోసం గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకొని అందుకు కృషిచేసి జీవితంలో గొప్ప విజయాలు సాధించాలని ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ (అటానమస్) కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో రెండో ఏడాది డిప్లమా విద్యార్థులు మూడో ఏడాది విద్యార్థులకు నిర్వహించిన ఫేర్‌వెల్‌కు ప్రత్యేక అతిథిగా ఆమె హాజరయ్యారు. విద్యార్థినులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజేతలైన వారికి కళాశాల పేరుతో బహుమతులు అందజేశారు. డిప్లమా ప్రిన్సిపల్ కె.కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.మల్లికార్జున్, అకడమిక్ డీన్ డాక్టర్ ఎ.కిశోర్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు, శుభాకాంక్షలు అందజేశారు.

విజ్ఞానాభివృద్ధికి చేసిన కృషికి తగిన ఫలితం ఇది

నరసరావుపేట: ఏఎం రెడ్డి ఫార్మసీ కళాశాల అనుసరిస్తున్న విద్యాప్రామాణికాలు, పరిశోధనల్లో నాణ్యత, విద్యార్థుల విజ్ఞానాభివృద్ధికి చేసిన కృషి ఫలితంగా కళాశాలకు అటానమస్ హోదా లభించిందని కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి శుక్రవారం వెల్లడించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ), సంబంధిత యూనివర్సిటీల నియమ నిబంధనల మేరకు అటానమస్ మంజూరు చేయబడిందన్నారు. ఫార్మసీ రంగంలో తమ కళాశాల 20 ఏళ్లు పూర్తి చేసుకుందని, తమ పూర్వ విద్యార్థులు దేశవిదేశాల్లో ఉన్నారన్నారు. అటానమస్ హోదాతో కూడిన బాధ్యతను సద్వినియోగం చేసుకుంటూ ఇంకా మెరుగైన విద్యాప్రమాణాలు అందించేందుకు తమ ప్రయత్నం జరుగుతుందన్నారు. ప్రస్తుత పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు అటానమస్ దోహదం చేస్తుందన్నారు.

కళాశాలకు అటానమస్ రావటం వలన పరిశ్రమలకు తగ్గట్లుగా విద్యార్థులను మార్చవచ్చని, ఫార్మసీలో రానున్న రోజుల్లో ఎన్నోమార్పులు జరుగుతాయని, పరిశ్రమలకు తగిన సిలబస్ ద్వారా విద్యాప్రమాణాలు పెంచవచ్చని అకడమిక్ డీన్ డాక్టర్ సురేఖ వెల్లడించారు. అటానమస్‌కు కృషి చేసిన కళాశాల యాజమాన్యం, బోధనా, బోధనేతర సిబ్బందికి కళాశాల ప్రిన్సిపల్ భార్గవ భూషణ్ కృతజ్ఞతలు తెలియచేశారు.

100 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న కోటేశ్వరరావు


నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో 100 మంది విద్యార్థులకు రూ.11,28,125ల స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో సీఎస్ఈ, ఐటీ బ్రాంచ్ నాల్గవ సంవత్సరం విద్యార్థులు రీసెర్చ్ పేపర్స్ రూపంలో అంతర్జాతీయ వేదికలలో ప్రెసెంట్ చేయడంతో పాటు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించినట్టు తెలిపారు. దీనిలో పాల్గొన్న 100 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేసినట్టు వివరించారు. సమాజానికి అవసరమైన వాటిని గుర్తించి వాటిని ప్రాజెక్ట్ రూపంలో అంతర్జాతీయ వేదికలపై వివరించిన విద్యార్థులకు స్టూడెంట్ రీసెర్చ్ ప్రమోషన్ స్కాలర్‌షిప్‌లో భాగంగా చెక్‌ను అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాలవైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ సోము వెంకటేశ్వర్లు, రీసెర్చ్ డీన్ డాక్టర్ ఎస్‌విఎస్ శ్రీనివాసు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంఏఎం ఫార్మసీ కళాశాలకు అటానమస్ హోదా

నరసరావుపేట రూరల్: స్థానిక కేసానుపల్లిలో గల మేదరమెట్ల అంజమ్మ మస్తానరావు ఫార్మసీ కళాశాలకి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి పదేళ్ల (2025-2026 నుంచి 2034-2035 వరకు) కాలానికి స్వయంప్రతిపత్తి హోదా లభించిందని ఎం ఏ ఎం విద్యాసంస్థల అధినేత మేదరమెట్ల రామశేషగిరిరావు శుక్రవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.

స్వయంప్రతిపత్తి హోదా కలిగిన తమ కళాశాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి, విద్యా, పరిశోధన రంగాలలో అభివృద్ధికి దోహదం చేస్తాయని, అవి విద్యార్థులకు నైపుణ్యాలు, జ్ఞానాన్ని పెంచడానికి, వారి కెరీర్‌ను మెరుగుపర్చేందుకు సహాయపడతాయని కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య తెలిపారు. మౌలిక సదుపాయాల మెరుగుదల, క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లపై దృష్టి సారించడం ద్వారా సమీప భవిష్యత్తులో విశ్వవిద్యాలయ హోదాను సాధించడానికి కళాశాల తీవ్రంగా కృషి చేస్తోందని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు అన్నారు. మొత్తం ఎంఏఎం ఫార్మసీ కళాశాల కుటుంబం సమిష్టి కృషి, తిరుగులేని మద్దతు లేకుండా ఈ విజయం సాధ్యంకాదని కళాశాల చైర్మన్ తెలిపారు. ప్రిన్సిపాల్, యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రుల అంకితభావం, కృషికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ చేస్తున్నామన్నారు.

ప్రధాని పర్యటన విజయవంతానికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: ప్రధానమంత్రి మే రెండో తేదీన అమరావతి వస్తున్నందున ఆయన పర్యటన విజయవంతమయ్యేందుకు అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. శుక్రవారం మున్సిపల్ అతిథి గృహంలో అధికారులు ఏర్పాటుచేసిన సమీక్షకు హాజరయ్యారు. ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజలు వెళ్లేందుకు బస్సులు, ఆహార ఏర్పాట్ల గురించి అధికారులతో సమీక్షించారు. అలాగే పట్టణంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పారిశుద్ధ్య కార్మికులు అందరూ విధి నిర్వహణలో పాల్గొని పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, దీనికి వార్డు శానిటరీ సెక్రటరీలు బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఆర్డీవో కె.మధులత మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, ఎంఈ కనకారావు, టీపీవో సాంబయ్య, డీఈ షేక్ రఫీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

నూజెండ్ల: మండల పరిధిలోని ఉద్యోగస్తులు తమకు అప్పగించిన ప్రభుత్వ సర్వేలు పూర్తి చేయాలని, నిర్లక్ష్య వైఖరి సహించేది లేదని పులిచింతల డిప్యూటీ కలెక్టర్ మండల ప్రత్యేకాధికారి వరదా సుబ్బారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి ఉద్యోగులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. సర్వేలు పూర్తి చేయని వారి నుంచి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అమలు కావాలంటే సర్వేలు పూర్తి కావాలని నూరుశాతం లక్ష్యాలు చేరుకోవాలని హెచ్చరించారు. వ్యక్తిగత వ్యవహారాలు పక్కనబెట్టి సర్వే పూర్తి చేయాలని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. వేసవి దృష్ట్యా మంచినీటి కొరత ఎదుర్కొనకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, తహసీల్దార్ రమేష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

యడ్లపాడు: చిలకలూరిపేట నుంచి గుంటూరు దిశగా వెళ్తున్న టిప్పర్ షడన్‌గా బ్రేక్ వేసి మలుపు తిప్పడంతో, వెనుక నుంచి వస్తున్న బైక్ అదుపుతప్పి టిప్పర్‌ను ఢీకొన్న ఘటన శుక్రవారం మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో యడ్లపాడు వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో బాపట్ల జిల్లా బల్లికురవ మండలం పాత మల్లయ్యపాలెం గ్రామానికి చెందిన యువకుడు బండి ప్రశాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్.సి.డి సర్వే పురోగతి పెంచాలి



శావల్యాపురం: దీర్ఘకాలిక వ్యాధుల (ఎన్.సి.డి) సర్వే పురోగతి పెంచాలని జిల్లా రాష్ట్రీయ బాల స్వచ్ఛీయ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కె) అధికారి డాక్టరు స్వర్ణా రాజేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య సిబ్బంది దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్ లక్షణాలు కల్గియున్న వారిని గుర్తిస్తే తక్షణమే నరసరావుపేట ఏరియా వైద్యశాలకు పంపించాలన్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే వైద్యసేవలు సకాలంలో అందిస్తే క్యాన్సర్ వ్యాధిని నియంత్రణ చేయవచ్చునన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్‌సీడీ సర్వే 62 శాతం చేసినట్లు తెలిపారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య, సూపర్‌వైజరు ఉమాదేవి, స్టాఫ్‌నర్సు ధనలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు ఇంకోల్లు నాగలక్ష్మి, బాజీ పాల్గొన్నారు.